క్లుప్తంగా

చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా సబ్బని ధర్మపురి

కామారెడ్డి అర్బన్: తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా సబ్బని ధర్మపురి నియమితులైనట్లు ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణహరి తెలిపారు. సబ్బని ధర్మపురిని నియమిస్తూ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. జిల్లాలో పద్మశాలీలు, చేనేత కార్మికుల స్థితిగతులపై త్వరలోనే అధ్యయనం చేసి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామని కృష్ణహరి పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. 40 చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. నాయకులు రవి పటేల్, హన్మంత్‌రావు దేశాయ్, రాంరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చీకోటి మనోజ్



నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి మహమ్మద్ నగర్, నిజాంసాగర్, పిట్లం మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చీకోటి మనోజ్ పటేల్‌ను నియమిస్తూ బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు జీవో కాపీని అందించారు. పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం మూడు మండలాల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. అయితే స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల నిర్ణయం మేరకు ఆశావాహులను తప్పించారు. నిజాంసాగర్ మండలం మాగి గ్రామానికి చెందిన చీకోటి. మనోజ్ పటేల్‌ను చైర్మన్, పిట్లం మండలానికి చెందిన మారెడ్డి కృష్ణారెడ్డిని వైస్ చైర్మన్‌గా నియమించారు. నిజాంసాగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ తదితరులున్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



బీబీపేట: మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న బీబీపేటకు చెందిన పూర్వ విద్యార్థి చింతకింది కళాకర్ ప్రస్తుతం ఢిల్లీ కెనరా బ్యాంకు రీజియన్ ఏజీఎంగా పని చేస్తుండడంతో అదే బ్యాంకు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షలతో కంప్యూటర్లు కొనేందుకు చెక్కును బుధవారం పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్‌కు అందజేశారు. పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగడంతో చదువుకున్న పాఠశాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో విద్యార్థులకు అందించినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల ప్రత్యేకాధికారిగా కామారెడ్డి ఏడీఏ లక్ష్మీప్రసన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రత్యేకాధికారిగా విధులు నిర్వహించిన బావయ్య బదిలీపై వెళ్లారు. దీంతో లక్ష్మీప్రసన్నను ప్రత్యేకాధికారిగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. ఆమెను ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీ నారాయణ సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 134 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ముగ్గురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఆర్‌బీఎస్‌కే వైద్యుడు మారుతి బాబు, నేత్ర వైద్య నిపుణుడు హరికృష్ణా రావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీగా బిచ్కుంద ఐటీఐ అప్‌గ్రేడ్

- జిల్లాకు ఒక ఏటీసీ సెంటర్ మంజూరు చేసిన ప్రభుత్వం
- బిచ్కుందకు చేరిన మిషన్లు, ఇతర సామగ్రి
- అందుబాటులోకి సాంకేతిక పరిజ్ఞానం
- కోర్సులపై విద్యార్థుల ఆసక్తి



బిచ్కుంద ఐటీఐ కళాశాల



యంత్ర పరికరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్(ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేస్తోంది. జిల్లాకు ఒక ఏటీసీ సెంటర్ మంజూరు చేసి బిచ్కుంద ఐటీఐ కళాశాలను ఏటీసీగా అప్‌గ్రేడ్ చేసి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఐటీఐ కళాశాలలో 40 ఏళ్ల కిందటి నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. పాత కోర్సులకు పోటీ ప్రపంచంలో ఆదరణ లేక ఉపాధి మార్గాలు దొరక్కపోవడంతో విద్యార్థులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఐటీఐలో అడ్మిషన్లు లేక కళాశాలలు మూత పడుతున్న తరుణంలో కొత్తగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కళాశాలలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఐటీఐలకు పూర్వ వైభవం తెచ్చే దిశగా వేగంగా చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రయోగాత్మకంగా బిచ్కుంద ఐటీఐ కళాశాలను ఏటీసీ సెంటర్‌గా మార్పు చేసింది. వీటి నిర్వహణకు టాటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఉన్నతాధికారులు ఆరు కోర్సులకు సంబంధించిన పరికరాలు, యంత్రాలు కూడా పంపించారు. ఏటీసీల్లో ఆధునిక కోర్సులు బోధించేందుకు ఒక్కో కేంద్రానికి అదనంగా 12 మంది అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు అవసరమని ఉన్నతాధికారులు అంచనా వేశారు. యువతకు శిక్షణ ఇవ్వడానికి ఏటీసీ కేంద్రంలో ఆధునాతన సాంకేతిక పరికరాలు అమర్చనున్నారు. ఈ కోర్సులతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుంది. శిక్షణ పొందిన తర్వాత కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి..

జిల్లాలో బిచ్కుంద ఐటీఐ, ఏటీసీగా అప్‌గ్రేడ్ కావడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేక దృష్టి సారించారు. సెంటర్‌ను సందర్శించి యంత్రాలు పరిశీలించి అడ్మిషన్ల ప్రక్రియ తెలుసుకొని వేగం పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అత్యాధునిక సాంకేతిక కోర్సులతో నైపుణ్యం పెంపొందించుకుంటే మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని విస్తృత ప్రచారం చేయాలని, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకొని విద్యార్థులను గుర్తించి అవగాహన కల్పించి అడ్మిషన్లు పొందే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో 172 సీట్లకు 172 సీట్లు భర్తీ అయ్యాయి. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులతో మాట్లాడి సెంటర్‌ను సందర్శించి పర్యవేక్షిస్తున్నారు. బోధించడానికి కళాశాలకు టెక్నికల్ అధికారులు కూడా అందుబాటులో ఉన్నారు.

అందుబాటులో ఆరు కోర్సులు..

- మ్యాన్ ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, 40 సీట్లు(ఏడాది కోర్సు)
- ఆర్టిజన్ యూజ్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, 40 సీట్లు(ఏడాది కోర్సు)
- ఇండస్ట్రీ రోబోటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్, 40 సీట్లు(ఏడాది కోర్సు)
- బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్ మెకానికల్, 24 సీట్లు(రెండేళ్ల కోర్సు)
- మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, 24 సీట్లు(రెండేళ్ల కోర్సు)
- అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్, 24 సీట్లు(రెండేళ్ల కోర్సు)

ఏటీసీతో మంచి ఉపాధి అవకాశాలు



కళాశాలలో అత్యాధునిక సాంకేతిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటికి చాలా డిమాండ్ ఉంది. చదువుకొని శిక్షణ పొందిన విద్యార్థులకు కార్పొరేట్ సంస్థల్లో, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సుల ప్రాధాన్యత వివరిస్తూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. త్వరలోనే శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.

– ప్రమోద్ కుమార్, ప్రిన్సిపాల్, ఐటీఐ కళాశాల, బిచ్కుంద

విద్యుత్ భారాన్ని ఆపడంలో బీఆర్ఎస్ విజయం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపాలని చూసిన రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని బీఆర్ఎస్ అడ్డుకుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముజీబొద్దీన్ మాట్లాడుతూ.. 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా దానిని వ్యతిరేకించామన్నారు. విద్యుత్ చార్జీలను పెంచకుండా కేటీఆర్ ఆధ్వర్యంలో ఈఆర్‌సీని బీఆర్ఎస్ పార్టీ ఒప్పించగలిగిందని అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కుంభాల రవి, బల్వంత్ రావు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి



పెద్ద శక్కర్గాలో మాట్లాడుతున్న ఆర్ఐ శంకర్

మద్నూర్(జుక్కల్): పౌర హక్కుల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆర్ఐ శంకర్ అన్నారు. పెద్ద శక్కర్గాలో బుధవారం రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా కుల వివక్ష చూపితే తక్షణమే ఫిర్యాదు చేయవచ్చన్నారు. సోషల్ వెల్ఫేర్ అధికారి సందీప్, కానిస్టేబుల్ ఓంకార్, గ్రామస్తులు ఉన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

భిక్కనూరు: ఎవరైనా పౌరహక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని భిక్కనూరు ఆర్ఐ బాలయ్య అన్నారు. బుధవారం అంతంపల్లిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. ఏఎస్సై జగదీష్, మాజీ ఎంపీటీసీ మంజుల, మాజీ సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న శోభన్

కామారెడ్డి టౌన్: పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా క్వింటాలుకు రూ.475 బోనస్ ఇవ్వాలన్నారు. పత్తి ధర తగ్గించి దళారులు విపరీతంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్, నాయకులు సుధాకర్, రఘుపతి, మధు, బానోత్ భీంసింగ్, రాంసింగ్ ఉన్నారు.

పశువులకు 'గాలికుంటు' టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



చందాపూర్‌లో టీకాలు వేస్తున్న వైద్యులు



కొండాపూర్‌లో టీకాలు వేస్తున్న వైద్యుడు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ధర్మారెడ్డి, కన్నారెడ్డి గ్రామాల్లో బుధవారం పశువైద్య సిబ్బంది గేదెలు, ఆవులు,ఎద్దులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు.రెండు గ్రామాల్లో కలిపి 211 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు.గాలికుంటు వ్యాధి రాకుండా ముందుజాగ్రత్తగా రైతులు వారి పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలనిఆయన సూచించారు.

చందాపూర్‌లో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): అన్నిరకాల పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్ అన్నారు. చందాపూర్‌లో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులకు వైద్యచికిత్సలు నిర్వహించారు. డాక్టర్లు రమేష్, అనూష, పాలకేంద్రం అధ్యక్షుడు సాయిరెడ్డి, సిబ్బంది పోచయ్య, కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

రాజంపేట: పశువులకు తప్పకుండా గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ వెటర్నరీ అధికారి రాజ వీరయ్య, వీఏ హాజి, గోపాల మిత్రలు రమేష్, రాము పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి



ఎస్సై కోనా రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఏఎస్పీ

కామారెడ్డి క్రైం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి అన్నారు. పదవీ విరమణ పొందుతున్న జిల్లాలోని ఇద్దరు ఎస్సైలకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పదవీ విరమణ పొందుతున్న ఎస్సైలు కోనా రెడ్డి, మధుసూదన్ రెడ్డి దంపతులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. వారిద్దరూ పోలీస్ శాఖకు అందించిన సేవలు మరువలేనివన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ సకాలంలో అందేలా చూస్తామన్నారు. డీఎస్పీ యాకూబ్ రెడ్డి, సీఐలు జార్జ్, మురళి, ఆర్ఐలు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


సంక్షిప్తం

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యారులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గాధారి రాజిరెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, ఉపాధ్యాయుడు షాకీర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రాజేందర్, గంగారెడ్డి, రాములు పాల్గొన్నారు.

కాంటాలు ప్రారంభించి రైస్ మిల్లులను కేటాయించాలి



భిక్కనూరు: వరి ధాన్యం కొనుగోలు కోసం కాంటాలు ప్రారంభించి, ధాన్యాన్ని తరలించేందుకు రైస్‌మిల్లులను ప్రభుత్వం కేటాయించాలని అంతంపల్లి విండో చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల్లో రైతులు ఆరబోసిన వరిధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం కాంటాలను ప్రారంభించకపోవడంతో 15 రోజులుగా ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన పెద్దమ్మ ఆలయం



బీబీపేట: దీపావళి ఉత్సవాలకు మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని చుట్టు పక్కల ప్రాంతాలను అలంకరించారు. ముదిరాజ్ సదర్ సంఘం ఆధ్వర్యంలో నేడు బోనాలతో పాటు ఎడ్ల బండ్ల ప్రదర్శన, వాహనాల ప్రదర్శన జరుగుతుందని సంఘం సభ్యులు తెలిపారు.

ఆలయాలకు ధూప దీప పూజ సామగ్రి వితరణ



కామారెడ్డి టౌన్/కామారెడ్డిఅర్బన్: దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలకు ధూప దీప పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ప్రతి కార్తిక మాసంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ట్రస్టు ప్రతినిధులు తరుణ్‌గౌడ్, ఏకేష్, రవి, వంశీ, భరత్, సాయి, వంశీ, భాను, శ్రీవర్ధన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి




నాగిరెడ్డిపేటలో శిక్షణలో భాగంగా మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్



లింగంపేటలో..శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీ గంగాధర్



సదాశివనగర్‌లో జెడ్పీ సీఈవో చందర్ నాయక్



మద్నూర్‌లో .. నోడల్ అధికారి నాగరాజు



నిజాంసాగర్‌లో.. ఎంపీడీవో గంగాధర్

సాక్షి నెట్‌వర్క్:సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు సూచించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఎన్యుమరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. నవంబర్ 1 నుంచి 3 వరకు కుటుంబాల సర్వే ఉంటుందని, 6 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని, రోజుకు పది కుటుంబాలను సర్వే చేయాలని వివరించారు. 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి 150 కుటుంబాలను ఒక బ్లాక్‌గా విభజించినట్లు తెలిపారు. ఒక బ్లాక్‌లో సర్వే కోసం ఒక ఎన్యుమరేటర్‌ను నియమించామని చెప్పారు. సర్వేలో ఒక కుటుంబానికి 56 అంశాలు ఉంటాయన్నారు. సర్వే కోసం నియమితులైన సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండాలని సూచించారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్



గాంధారిలో శిక్షణ ఇస్తున్న అధికారులు



బీబీపేటలో ..ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్



బాన్సువాడలో .. ఏఎస్‌వో కిషన్‌నాయక్



రాజంపేటలో..



దోమకొండలో.. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

చెరుకు విత్తనం పరిశీలన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లికి చెందిన రైతులు బుధవారం జహీరాబాద్‌లో రైతులు సాగు చేసిన చెరుకును పరిశీలించారు. అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో చెరుకును పరిశీలించడానికి వెళ్లినట్లు రైతులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకరానికి కేవలం 40 నుంచి 50 టన్నుల దిగుబడి రావడం, జహీరాబాద్‌లో రైతులు సాగు చేసిన చెరుకు ఎకరానికి 60 నుంచి 70 టన్నుల దిగుబడి రావడంతో వారు పాటిస్తున్న మెలకువలను అడిగి తెలుసుకున్నారు. మహారాష్ట్ర నుంచి చెరుకు విత్తనాన్ని తెప్పించి సాగు చేసినట్లు అక్కడి రైతులు వివరించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మార రమేశ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చిన్న భైరవ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ ఫీల్డ్‌మన్ రాజేశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

విడదీసే కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ



బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు మెమోరాండం అందిస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

బాన్సువాడ రూరల్: అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉన్న మాల, మాదిగలు, ఇతర ఉప కులాలుగా విభజించాలనే రాజకీయ కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ చేపడుతున్నారని మాలమహానాడు రాష్ట్ర నాయకులు గైని ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన బాన్సువాడలో స్థానిక మాల మహానాడు నాయకులతో కలిసి ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కిరణ్మయికి మెమోరాండం అందజేశారు. నాయకులు నెర్రె నర్సింహులు, మల్లూర్ సాయిలు, దేశాయిపేట్ ప్రశాంత్, మన్నె సాయిలు, బేగరి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున ఉపాధ్యాయురాలి రక్తదానం



కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు క్యాతం వెన్నెల ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు అన్నారు. బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా వెన్నెల 11వ సారి ఏ–పాజిటివ్ రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పలువురు వైద్యులు అభినందించారు. వెన్నెలను ఆదర్శంగా తీసుకుని మహిళలు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.రాజన్న అన్నారు. వెన్నెల తండ్రి న్యాయవాది క్యాతం సిద్ధిరాములు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.